పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కాటారం : గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పోషకాలతో కూడిన ఆహారం తింటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. పోషణ పక్షంలో భాగంగా కాటారం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు సంయుక్తంగా మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషకాలతో కూడిన ఆహారపదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో కూడిన ఆహారపదార్థాలు, ఆకుకూరలు, కూరగాయల్లో అనేక పోషకాలు ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలని, టీటీ ఇంజక్షన్‌లు సమయం ప్రకారం వాడాలని పేర్కొన్నారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే ప్రీ స్కూల్‌కు పంపించాలని తెలిపారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అమ్మక్క, అనసూయ, అమృతరాణి, విమల, శ్యామల, కృష్ణవేణి, ప్రేమలత, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు, ఆయాలు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీకి పంపాలి

మల్హర్ : మండలంలోని కొండంపేట, కేసారంపల్లి, నాచారం, మల్లంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడారు. మూడేళ్ల నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులను అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ బుక్స్, పిల్లల ప్రొఫైల్ అభివృద్ధి చార్టు, పర్యవేక్షణ కార్డు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతందని ఆమె తెలిపారు. వీటి ద్వారా పిల్లలకు పౌష్టికాహారం సరఫరా చేసి వారి శారీరక, మానసిక స్థాయిని మెరుగు పరచడానికి దోహదం చేస్తోందన్నారు. ఆరునెలల పాటు చిన్నారులకు తల్లి పాలు తాగించాలని, ఆతర్వాత తల్లి పాలతో పాటు కేంద్రంలో ఇచ్చే బాలామృతం, గుడ్లు తినిపించాలని వివరించారు. అనంతరం పోషణ పక్వాడాలో భాగంగా గర్భిణులకు సీమంతం చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని సూరారం అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, శానిటేషన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



మహదేవపూర్: అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ రమ

కొనసాగుతున్న పోషణ్ పక్వాడా..

ఎస్‌ఎస్‌తాడ్వాయి : పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ విజయ అన్నారు. మంగళవారం మండలంలోని కామారం ఒకటో, రెండో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ విజయ మాట్లాడుతూ.. ప్రతి రోజు పోషకాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారించడమే కాకుండా పుట్టబోయే బిడ్డకు మంచి ఎదుగుదల ఉంటుందన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాలల పరిరక్షణ జిల్లా విభాగం సోషల్ వర్కర్ జ్యోతి మాట్లాడుతూ.. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలిగిన వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు కొర్నెబెల్లి జానకి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. మంగళవారం మండలంలోని దామరవాయి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమానికి ఆమె హాజరై పిల్లల తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారం విలువలను వివరించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అరికట్టవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పాలు, గుడ్డుతో కూడిన భోజనం లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. బాలమృతంలో కలిగే పోషణ లాభాలను తెలియపర్చారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి ప్రీస్కూల్ సేవలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సావిత్రి, అమృత, ఆయాలు పొమ్మక్క, ప్రవంతి పాల్గొన్నారు.



మల్హర్: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రాధిక



కాటారం : ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది

క్లుప్తంగా

సన్మానం



మహాముత్తారం : ఇటీవల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌కుమార్‌ను మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో శాలువాలతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గడ్డం రాజబాపు, మండల ప్రచార కమిటీ కార్యదర్శి సకినాల రాజు ఉన్నారు.

బీఎస్పీకి రాజీనామా

టేకుమట్ల : బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల అధ్యక్ష పదవికి, సభ్యత్వానికి, స్వేరో మండల అధ్యక్ష పదవికి, స్వేరో సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సంగి రవివర్మ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్థాపించిన స్వేరో ఆర్గనైజింగ్‌కు ఇన్నాళ్లు మండల అధ్యక్షుడిగా పని చేశానన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

మహాముత్తారం : మండలంలోని జెడ్పీఎస్ఎస్‌లో రెండో రోజు మంగళవారం పదో తరగతి వార్షిక పరీక్షలు జరిగాయి. ఈ పరీక్ష కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. 159మంది విద్యార్థులకు 158 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేగొండలో..

రేగొండ : మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ద్వితీయ భాషకు సంబంధించి రేగొండలో 220 మంది, రంగయ్యపల్లిలో 116 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్ తెలిపారు. మండలంలోని పరీక్ష కేంద్రాలను ఏఎంఓ లక్ష్మణ్, సీఎంఓ కిషన్‌రావు తనిఖీ చేశారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

టేకుమట్ల : మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన యువకుడు అడ్డూరి కార్తీక్ (23) కొంతకాలంగా కడుపు నొప్పితో పాటు అస్తమాతో బాధపడుతున్నాడు. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈనెల 12వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9వ తరగతిలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా సూచించిన పరీక్ష కేంద్రాల్లో ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష పూర్తి వివరాలకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెబ్‌సైట్ టీఎస్ డబ్ల్యూఆర్ఐఈఎస్.ఇన్‌ను వీక్షించాలని సూచించారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఏటూరునాగారం : మండలకేంద్రంలోని ఐటీడీఏ సమీపంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పైపులైన్ లీకేజీ, ఓవర్ ఫ్లో ద్వారా ఇబ్బందుల దృష్ట్యా గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి దామోదరస్వామి, కార్యదర్శి రమాదేవి మంగళవారం మరమ్మతులు చేయించారు. వాటర్ ట్యాంక్ నుంచి ఓవర్ ఫ్లో అవుతున్న నీరు పక్కనే ఉన్న ప్రెస్‌క్లబ్ భవనంలోకి రావడంతో నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఓవర్ ఫ్లో కాకుండా చూస్తామని, లీకేజీలు లేని పైపులైన్ నిర్మాణం చేపడుతున్నట్లు దామోదర స్వామి తెలిపారు. సిబ్బంది రవీందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయించాలి



టీకా వేస్తున్న సుధారాణి

వెంకటాపురం (ఎం) : రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని నర్సాపూర్ పశువైద్యాధికారి సుధారాణి సూచించారు. మంగళవారం మండలంలోని పాపయ్యపల్లిలో నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని పీఏసీఎస్ చైర్మన్ మాడుగుల రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి సిబ్బందితో కలిసి గ్రామంలోని 50 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భాస్కర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



చిట్యాల: తిర్మలాపూర్‌లో కారును తనిఖీ చేస్తున్న ఎస్సై



డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

చిట్యాల : మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై ఎండి.శాఖాన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని తిర్మలాపూర్ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. అలాగే ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం అనుమతి పత్రాలు లేని ఆరుగురికి జరిమానా విధించారు. అలాగే ఒకరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మహాముత్తారం : మండలంలోని పెగడపల్లి, ప్రేమ్‌నగర్ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై మంగళవారం ఎస్సై మహేందర్‌కుమార్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వంద లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ప్రేమ్‌నగర్ గ్రామానికి చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై వెంట సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

‘యువతకు అవకాశం కల్పించాలి’

ములుగు : ప్రజాసేవ కోసం పాటుపడే యువతకు పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశం కల్పించాలని డాక్టర్ అనిల్‌కుమార్ బోడ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని రిటైర్డ్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మార్పుకోసం తపించి ఈసారి మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని వెల్లడించారు. పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపిస్తే గిరిజన బిడ్డగా నిరుద్యోగ సమస్యతో బాధపడుతున్న యువతకు అండగా నిలుస్తానని అన్నారు. ఆయన వెంట రవికుమార్, భగత్, సాగర్, లవణ్‌నాయక్, వెంకటేష్, రాజ్‌కుమార్, గణేష్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు

కాటారం: రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. రైతులు ప్రస్తుతం వరి సాగులో పాటించాల్సిన మెలకువలు, ఆయిల్ పామ్ సాగు లాభాలు, వేసవిలో కూరగాయల సాగు సస్యరక్షణ, మందుల వాడకంపై అన్నదాతలకు వివరించారు. రైతులు పంటల సాగులోని పలు సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లగా వాటిపై చర్చించారు. మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, ఏఈఓలు, ఉద్యానవన శాఖ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

‘దొమ్మాటి’కే టికెట్ ఇవ్వాలి

పరకాల: ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో పోలీసు ఉద్యోగాన్ని వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చిన పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యకే వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని పరకాల కోర్టు కాంగ్రెస్ లీగల్‌సెల్ కన్వీనర్ ఒంటేరు రాజమౌళి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేరుగు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పరకాల కోర్టు ఎదుట నినాదాలు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన ఎనలేని కృషి చేశారని అన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్ : మండలంలోని మల్లారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు తాడిచర్లలో బొగ్గు సేకరణ చేపడుతున్న ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎమ్మార్ కంపెనీ సీపీఆర్ఓ మల్లేశ్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రానికి ఎగ్జామ్స్ పూర్తయ్యే వరకు విద్యార్థులను ఉచిత బస్సులో తీసుకెళ్లనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా జయశంకర్ భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి నియమాకం పట్ల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు గాండ్ల(రెడ్డిగాండ్ల) సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ సెంటర్‌లో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఐత కర్ణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఐత ప్రకాశ్‌రెడ్డిని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడానికి కృషి చేసిన శ్రీధర్‌బాబుకు, భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబుకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దె పోషిరెడ్డి, రత్నం సమ్మిరెడ్డి, పోటు రత్నాకర్‌రెడ్డి, పద్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దేవన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, శ్రీనివాస్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు



వైద్యశిబిరంలో డాక్టర్ భవ్యశ్రీ, మహిళలు

వెంకటాపురం(కె) : స్థానిక ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు మంగళవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. 62మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

అపరిచితులకు సహకరించొద్దు



వాజేడు: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై



ములుగు రూరల్: మాట్లాడుతున్న సీఐ రంజిత్ కుమార్

ఎస్ఎస్ తాడ్వాయి : ఏజెన్సీ గ్రామాల్లో అపరిచితులకు సహకరించొద్దని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గొత్తికోయలకు సూచించారు. మంగళవారం మండలంలోని కొశెట్టివాయి, ఇప్పలగడ్డ, భూపతిపూర్ గొత్తికోయగూడేల్లో సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలతో ఎస్సై తనిఖీ నిర్వహించారు. గూడేంలో నివసిస్తున్న గొత్తికోయల వివరాలను సేకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని కాటాపూర్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి

వాజేడు : మత్తు పదార్థాలకు ప్రజలు, యువత దూరంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని మొరుమూరు కాలనీ గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంజాయి, గుడుంబా వంటి మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి.. ఆరుగురిపై కేసు

వాజేడు మండల పరిధిలోని మొరుమూరు కాలనీ గ్రామంలో మంగళవారం ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. తెల్లం హరీష్, చింత సమ్మయ్య, తాటి శుక్రమ్, నక్క చంద్రశేఖర్, తెల్లం లక్ష్మయ్య, కురసం శ్రీను గుడుంబా తయారు చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారుగా 4,100 లీటర్ల బెల్లం పానకంతో ఉన్నట్లు వివరించారు. స్థానిక యువత సహకారంతో బెల్లపానకం పారబోసి డ్రమ్ములు, గుడుంబా తయారీకి సంబంధించిన సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ములుగు రూరల్ : వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ములుగు సీఐ రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బండారుపల్లిలో స్థానిక యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాట్సప్ గ్రూప్‌ల్లో అడ్మిన్‌లు జాగ్రత్తలు పాటించాలన్నారు. పార్టీలకు వ్యతిరేకంగా పోస్టులు చేసి ఇబ్బందులు తెచ్చుకోకూడదని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, గుడుంబా, వన్య ప్రాణుల వేట చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వర్, రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మల్లేష్‌గౌడ్

చిట్యాల : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ దగ్గు మల్లేష్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో గొడవలు పెట్టుకున్న లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన కేసులు నమోదు చేసి పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎండి షాఖాన్, అశోక్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.